## క్లుప్తంగా

### ఆత్మీయ కలయిక



జగన్‌ను కలిసిన వంగా గీత

పిఠాపురం: విదేశీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కాకినాడ మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు.

### ముద్రగడను కలిసిన నాయకులు



ముద్రగడతో మాట్లాడుతున్న మండల నాయకులు

కొత్తపల్లి: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు కలుసుకున్నారు. యువకుడు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ముద్రగడను కలిసిన వారిలో మండల వైఎస్సార్ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్ కుమార్, సర్పంచ్‌లు పాలాని దొరబాబు, ఎంపీటీసీ ఉమ్మిడి జాన్, రావు చిన్నారావు, ఉపసర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు, గాది గంగబాబు తదితరులు ఉన్నారు.

### క్యాన్సర్‌పై ఆందోళన వద్దు



మాధవపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట: క్యాన్సర్ వ్యాధిపై ఆందోళన చెందవలసిన పని లేదని, అవగాహన పెంచుకోవడం ద్వారా నివారణ సాధ్యమని డాక్టరు బి.వీర్రాజు భరోసా ఇచ్చారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మాధవపట్నంలోని గ్లోబల్ ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ని గుర్తించి చికిత్స పొందితే వ్యాధి మాయం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

### భీష్మ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో కొలువైన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో 8వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ లక్ష్మీనారాయణ సేవా సమాజం ఆధ్వర్యంలో 13వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, భజన సమాజాలతో ఏకాహం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### భవిత సేవల పరిశీలన



ఫిజియోథెరపీ చికిత్సను పరిశీలిస్తున్న ఎంఈఓ చౌదరి

పెద్దాపురం: భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వీఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ సేవలను మంగళవారం ఆయన పరిశీలించి సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభా వంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థికి అందిస్తున్న ఫిజియో థెరపీని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గా ప్రసాద్‌రెడ్డి, ఆనందరావు, పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి, ఫిజియో థెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్సవాల నిర్వహణపై 6న సమీక్ష

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న ఉత్సవాలపై ఆర్డీఓ ఎస్ మల్లిబాబు అధ్యక్షతన అధికారుల సమీక్ష నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ రాత్రి స్వామి కల్యాణం, 26న మహాశివరాత్రి ఉత్సవం, 27న రథోత్సవం , మార్చి ఒకటిన స్వామి వారి శ్రీపుష్ప యోగోత్సవాలు ఉంటాయని చెప్పారు. ఈ మేరకు ఆయా కార్యక్రమాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ఆయా శాఖల అధికారులు అందించే సేవలపై గురువారం ఉదయం 10.30 నిమిషాలకు సమీక్ష సమావేశం ప్రారంభం అవుతుదన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు కావాల్సి ఉంటుందని, ఇప్పటికే భక్తులతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు.



భువనేశ్వరి పీఠంలో రథ సప్తమి వేడుకల్లో హోమం చేస్తున్న పండితులు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో సూర్యనారాయణమూర్తి కళ్యాణం



తాటిపర్తిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పాండవుల మెట్టపై పూజలు నిర్వహిస్తున్న కో–ఆర్డినేటర్ దొరబాబు

# భోగభాగ్యాలు పొంగి పొర్లాలి

**రథ సప్తమి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటా.. ఆలయాల్లో వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఇళ్లలో ఆవు పాలను ఆవుపిడకల పొయ్యిపై పొంగించి పరవాన్నం వండి ప్రత్యక్ష నారాయణుడైన సూర్య భగవానుడికి నివేదించారు. చిక్కుడు ఆకుల్లో ప్రసాదాలను పంచారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తజనంతో పోటెత్తాయి. ఆలయాల ఆవరణల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.**



దుర్గాడలో పాలు పొంగిస్తున్న భక్తులు



పాండవుల మెట్టపై పొంగలి వండుతున్న భక్తులు

- ఇంటింటా రథ సప్తమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

పెద్దాపురం: రథ సప్తమి వేడుకలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక అమరగిరి మెట్టకు భక్తులు పోటెత్తగా మహిళలు భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించి మెట్టపై పాలు పొంగించి స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వై.అనంతలక్ష్మి, గీతా వాణి, వై.కిషోర్ భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానికి కిలో మీటరున్నర మేర భక్తులు క్యూ కట్టారు. ఎస్‌ఐ మౌనిక ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు. పాండవుల మెట్టపై సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైఎస్సార్ సీపీ అయ్యరయ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు విడదాసరి రాజా తదితరులున్నారు.

**శారదా సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం**

సామర్లకోట మండల పెదబ్రహ్మదేవం శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదిత్య విద్యా సంస్థల కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ మేడపాటి భాస్కర్ చంద్రారెడ్డి, భాస్కరరెడ్డి ప్రారంభించగా సుమారు మూడు వేల మందికి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు చేశారు. అలాగే మండలంలోని గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో గవరసాని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పంచారామ క్షేత్రంలో వైభవంగా కల్యాణం**

సామర్లకోట: స్థానిక కుమారా రామభీమేశ్వర ఆలయంలో కొలువైన సూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, పట్టు వస్త్రాలు, పూలతో అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, భక్త సంఘ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్త సంఘం నాయకుడు బిక్కిన రాజశేఖర్, వాణి దంపతులు కర్తలుగా కల్యాణం జరిపించారు. కల్యాణం విశిష్టతను ఆలయ శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ వివరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్త సంఘ నాయకులు సేవలు అందించారు.

**రామలింగేశ్వరస్వామి ఆలయంలో**

స్థానిక ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో సూర్యనారాయణ మూర్తి కల్యాణం జరిగింది. అలాగే స్థానిక మాండవ్యనారాయణస్వామి ఆలయంలోను, జగదీశ్వర స్వామి ఆలయంలోను, మండల పరిధిలోని వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

**పిఠాపురంలో**

పిఠాపురం: నియోజక వర్గ పరిధిలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక దాయిలాలు ఏర్పాటు చేసి పాలు పొంగించి పరమాన్నం తయారు చేసి నివేదించారు. పాదగయ క్షేత్రంతో పాటు కుంతీమాధవస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉప్పాడ సాగరతీరంలో సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు సూర్య నమస్కారాలు చేసారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ, తాటిపర్తి రామలింగేశ్వర స్వామి, అపర్ణాదేవి ఆలయ ప్రాంగణాల్లోని సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు.

**ఆకట్టుకున్న సూర్యభగవానుడి రంగవల్లి**

పిఠాపురం: గొల్లప్రోలు మండలం, దుర్గాడ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని సూర్యనారాయణమూర్తి ఉపాలయంలో రంగవల్లులతో వేసిన సూర్య భగవానుడి చిత్రం ఆకట్టుకుంది.

**ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు**

పిఠాపురం: రథసప్తమి సందర్భంగా పిఠాపురం అగ్రహారంలోని ఉమా ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహించిన చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు ఫణి శర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మహిళలు పాలు పొంగించి స్వామికి నివేదించారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాడలోని సూర్యభగవానుడు

సాయంత్రం ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శృతిలయ సంగీత నాట్యాలయం ప్రవీణా విశ్వేశ్వరరావు శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రామాయణ శబ్దం, దశావతారాలు కీర్తనలు నృత్యాలు నాట్య కళాభిమానులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం సూరవరపు సురేష్ కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు చిన్నారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు.

## ‘పొలం పిలుస్తోంది’ని సద్వినియోగం చేసుకోండి



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్

పిఠాపురం: పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవశాఖాధికారి ఎన్ విజయ్‌కుమార్ రైతులకు సూచించారు. మండలం పి.తిమ్మాపురంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, సమీకృత సేంద్రియ వ్యవసాయం, సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం, వరి పంటను ఆశించే చీడపీడలు, నివారణ పద్ధతులను వివరించారు. డ్రోన్ వినియోగం, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ, పెద్దాపురం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకురాలు మాధవి, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకురాలు పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి ఎ.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్షేత్ర సందర్శనలో భాగంగా వరి పంటను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

## రెడ్‌క్రాస్ సేవలు మరింత ముమ్మరం

**ఏపీ చైర్మన్ రామారావు**



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

పెద్దాపురం: జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ సేవలను మరింత ముందుకు తీసుకువెళ్తానని ఏపీ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో మంగళవారం ఆయనను విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు పాల్గొని రామారావు సేవలను కొనియాడారు. పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ అజాతశత్రువు వైడీఆర్ అన్నారు. సన్మాన గ్రహీత రామారావు మాట్లాడుతూ పదవులు బాధ్యతను పెంచుతాయని, రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు, పాఠశాల హెచ్‌ఓడీలు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలతో ప్రమాదాలు దూరం



హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ నూనె రమేష్, రామారావు

కాకినాడ క్రైం: ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రహదారి ప్రమాదాలు దూరమవుతాయని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా కాకినాడలోని వార్ఫ్ రోడ్డులో అంబేద్కర్ భవన్‌లో ఆటో యూనియన్, బస్ డ్రైవర్లకు ఆయన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు, ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌లు సంయుక్తంగా హెల్మెట్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి భానుగుడి వరకు ఈ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు నూనె రమేష్, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## నగర వనాల ఏర్పాటుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- చెందుర్తిలో స్థల పరిశీలన



పిఠాపురంలో నగర వనం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పిఠాపురం: జిల్లాలో నగర, పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన నగరవనాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. నగర వనం ఏర్పాటులో భాగంగా ఆయన మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. భూ రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో నగర, పట్టణ ప్రాంతాల్లో జిల్లాలో నగర వనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రభుత్వ భూములు, అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా ఎకో టూరిజం కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని అధికారులు ఆదేశించారు. అనంతరం ఆయన గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ పరిధిలోని భూములను పరిశీలించారు. భవిష్యత్తులో స్థాపించబోయే పరిశ్రమలకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్.మల్లి బాబు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రేపు బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: ఈ నెల 8, 9 ,10, 11 తేదీలలో పిఠాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ బాల, బాలికల చాంపియన్ షిప్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఈనెల 6న నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగే జట్ల ఎంపిక ఈ నెల ఆరో తేదీన రామచంద్రపురంలో ఉదయం 9 గంటల నుంచి బాల బాలికలను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 తర్వాత పుట్టిన వారై ఉండాలని, క్రీడాకారులు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ పుట్టిన తేదీ సర్టిఫికెట్లను తమ వెంట తీసుకురావాలని తెలిపారు.

### కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడాలి

బాలాజీచెరువు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా పోటీపడాలని లయన్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో మంగళవారం సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ పోటీతత్వం ద్వారా విద్యార్థుల్లో కష్టపడే తత్వం పెరిగి విజయాల సాధనకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మ్యాథ్స్, సైన్స్ అంశాలపై పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసపత్రాలు అందజేసారు. క్లబ్ ప్రతినిధులు ఏఆర్ మోహన్‌కుమార్, ఎన్.మురళీకృష్ణ, దొడ్డి రామసుబ్రహ్మణ్యం, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

### రేపు మధ్వ నవమి వేడుకలు

బోట్‌క్లబ్: కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6న మధ్వ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధి రాచూరి శేషగిరిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 8న గొంచాల నుంచి భద్రాచలానికి రథయాత్ర

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామం నుంచి భద్రాచలానికి 14వ రథయాత్ర చేపట్టినట్టు భద్రాద్రి యాత్ర గురుస్వామి వుంగరాల వీరవెంకట సుబ్బారావు మంగళవారం తెలిపారు. సీతారామ పరివారం ఉన్న రథంతో కాలినడకన తొమ్మిది రోజుల పాదయాత్ర చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ యాత్రలో పాల్గొనే భక్తులు ఆధార్ నకలుతో పాటు రసీదులు, హామీపత్రం అందజేయాలని వివరించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు వింటి బాబ్జీ, అధ్యక్షుడు పేర్నిడి వెంకట రమణ, ఉపాధ్యక్షుడు పేర్నిడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి యేలూరి శ్రీనివాసు, కోశాధికారి పేర్నిడి సత్యనారాయణల ఆధ్వర్యంలో యాత్ర జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో దాతల సహకారంతో భోజనాలు, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామని ఆర్డీవో ఎస్.మల్లిబాబు అన్నారు. మంగళవారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 117 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ నెల నుంచి జనవరి వరకు 13 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 216 స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణి, స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులను, వాల్‌పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 18004253365ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు, వివిధ శాఖల వైద్యులు కె.రోజాప్రియ, నురునిస్సా బేగం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్పై సీహెచ్ కుమార్, వి.వరలక్ష్మి, కె.సింహాద్రి, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఏపీ లాన్ టెన్నిస్ సహకారంతో జిల్లా లాన్‌టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న అండర్–16 ఆల్ ఇండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. బాలుర సింగిల్స్ విభాగంలో కార్తిక్ (ఏపి)పై ధ్రువ్ (తమిళనాడు) 6–0, 6–0, విజేత్ (తెలంగాణ)పై తనిష్ (తెలంగాణ) 6–4,6–1, ప్రతీక్ (ఏపీ)పై ఎస్‌వీ సూర్య (ఏపీ) 6–3, 6–7, 6–3, హర్ష (ఏపీ) పై భవేష్ (తెలంగాణ) 6–0, 6–0 స్కోర్‌తో విజయం సాధించారు. బాలికల విభాగంలో స్వార (ఏపీ) పై జోషిత (ఏపీ) 6–4, 6–0, రెబ్క (తెలంగాణ) పై జానకి (ఏపీ) 6–4, 6–1, లలిత (ఏపీ) పై గౌరిశ్రీ (తెలంగాణ) 6–1, 6–0, తేజశ్రీ (ఏపీ)పై లేఖ్య (ఏపి) 6–1, 6–1 స్కోర్‌తో గెలుపొందారు. మంగళవారం నిర్వహించిన పోటీలను ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్ కుమార్, టోర్నీ చీఫ్ రిఫరీ శివకుమార్ పర్యవేక్షించారు.